# రొమేన్స్

'ఏమిటోయ్ రమా... ఇంట్లో ఏదో కొత్తదనం కన్పిస్తోంది... కళకళలాడుతోంది... ఏంటి సంగతి?-' కాలిబూటులేసు విప్పుతూ చుట్టూ ఓసారి పరికించి శ్రీమతిని అడిగాడు సరసారావు.

ఒఠి అడగటంకాదు అందుబాటులో నిలబడిన శ్రీమతి నడుము చుట్టూ చెయ్యి వేసి దగ్గరకు లాక్కుని మరీ ప్రశ్నించాడు.

'మీకంతా చతురే! సరసానికైనా వేళాపాళా... సమయం సందర్భంవుండాలి... అబ్బ వదలండీ...' గింజుకుంది రమ.

'ఇక్కఎడరూ లేరుకదోయ్ నువ్వు నేను తప్పించి...' టైనాట్ లూజు చేస్తూ కొంటెగ శ్రీమతి కళ్లలో దృష్టి నిలిపి మరీ అన్నాడు.

'లేకేం?... ఈరోజు కొత్త పనిమనిషిని పన్లో పెట్టాను. మనిషెంత సుకుమారంగ... సుందరంగ వుందనుకున్నారూ?...'

'నీకంటేనా? రంభ ఊర్వషి వేనకలే నీ బ్యూటీ ముందు బలాదూర్... మామై రైట్...'

'మీరెప్పుడూ రేటే... కాకపోతే మీతో ప్రాబ్లమల్లా...'

'ఆగిపోయావేం? అదేదో అనేసెయ్. ప్రూఫ్ దీడింగ్‌లో అచ్చు తప్పులను సరిదిద్దినట్టు నా మిస్టేక్సేమైనా వుంటే రెక్టిఫై చేసుకుంటాడీ దాసుడు...'

'దాసుడేంటి?... హరిదాసులా.. హరికథలు చెప్పేదాసుడిలా?-'

'అమ్మా! నీ మాటల్లో ఛమక్కుంది. నీది ఎం.ఏ. తెలుగు కదా! - ' చెణుకు విసిరాడు.

'అయ్యో... అబ్బా... అలా గిల్లకండి బుగ్గ కందిపోతుంది!. ఇంటికొచ్చారంటే చాలు మీతో అనుక్షణం ఇదే గొడవ...'

గొడవ కాదే నా డార్లింగ్ పెళ్లామా? సరదా సరసం!'

'సరసాల్లో ఇన్ని వెరైటీలున్నాయా...?-'

'ఏమో నాకు మాత్రం ఏమి తెలుసు?. సరససల్లాపాలు ప్యూర్లీ ఆడవారి సొంతం!

దానిపై సర్వాధికారాలూ మీవేనోయ్...' కోటు స్టాండు మీదున్న లుంగీ అందుకుని చుట్టేసుకున్నాను.

సరసారావు అదృష్టానికి... లుంగీచుట్టుకోవటంలో అతగాడి శ్రీమతి కూడా దగ్గర్లోనే వుండటాన కవర్ అయింది.

'అబ్బా... ఏమిటీ మోటు సరసం?- లంగీ మీ వక్కరికే.. మనిద్దరికీ కలిపి కాదు మహాశయా...' నెత్తిన తీయని మొట్టికాయ ఒకటిచ్చి 'కాఫీ తెస్తానుండండి... ' కిచన్‌లోకి తుర్రుమంది.

కాఫీ ఫినిష్ చేసి బాత్‌రూమ్‌లోకి జొరబడ్డాడు సరసారావు స్నానానికి!.

'ఏంటీ నేనూరానా?-' బిగ్గరగా అంది

'ఛపో! సిగ్గులేనిదానా...'

'మరేంటి రివర్స్! పెళ్లాన్ని బాత్‌రూమ్‌లోకి రానని గింజుకుంటున్నా.. గుంజుకుంటారు... వీపు తోమటానికి...అలాంటిది...?' వాక్యాన్ని మధ్యలోనే ఆపింది.

'మనమంతేలే... వచ్చాక నీ పన్చెప్తా...' గబగబా షవర్‌బాత్ ఫినిష్ చేసొచ్చేడు.

'అప్పుడే అయిందా?-'

'అంటే బాత్‌రూమ్‌లో కాపురం వుండమంటావా?-మగాళ్లు... సారీ మొగుళ్లు... మీ ఆడాళ్లలా గంటల తరబడి రుద్దుకుంటూ కాక్షేపం చెయ్యరు. ఇది స్పీడ్ యుగం కదా?... అంతా ఫాస్టే... 'అద్సరే'! ఇందాక నువ్వేదో చెప్పబోయినదానివల్లా సబ్జక్ట్ డైవర్ట్ చేసి అసలు విషయం చెప్పనేలేదు....' అద్దముందు నిలబడి డియోడరెంట్ స్ప్రే' చేసుకుంటూ ఒకసారి శ్రీమతి వంటి మీద కూడా 'స్ప్రే' చేశాడు.

'అందుకే బాబూ... మీ దగ్గరకు రావాలంటేనే భయం...' పై మునిపంటితో క్రింది పెదవిని ఫోల్డు చేసివుంచి తన్మయత్వంతో అనేసింది.

'ఈ వంకర్లు తిరిగిపోవటానికేమొచ్చె గానీ... అసలు పాయింట్‌కిరా...' మేగజైన్ అందుకుని శ్రీమతి చెయ్యి గుంజి తనవొడిలో పడేట్టు చేశాడు.

'పెద్ద విషయమేం కాదు... కొత్త పనిమనిషి ఎంత మోడ్రన్‌గా వుందనుకున్నారు...?... గోల్డ్ ఫ్రేమ్ గ్లాసెసు... పెదాలకు లిప్‌స్టిక్... హైహీల్సు... పోనీటెయిల్ హెయిర్ స్టైల్... బొడ్డుకిందికి చీరె... ఎంత మోడ్రన్‌గ వుందో తెలుసా?-

ముద్దొస్తోందనుకోండి...'

'నేను చూస్తేగా తెలియటానికి! అవునూ... అంత బ్యూటిఫుల్‌గా వుంటుందా?... దాన్నెందుకు అంత పొగొడేస్తున్నావ్?-'

'తిప్పుకుంటూ వయ్యారాలొలికిస్తూ నడుస్తుంటే మతిపోయింది నాకు...'

'పొట్ట కూటికోసం వచ్చినామెకు వేషమహిమ దేనికో-' సరసారావుకి డౌటొచ్చి నొసలు చిట్లించాడు.

'వరల్డ్ బ్యూటీ ఆమె ముందు దిగదుడుపు! చేతిలో మొబైలొకటి. - ఇంకా నాలుగు రోజులు పోతే స్కూటీ మీదే పనికొస్తుందేమో?- మనిషి ఎర్రగ బుర్రగ నాజూగ్గా హిందీ సినీమా హీరోయిన్‌లావుంది.... మీరు చూశారంటే... మూర్ఛపోతారు....'

'నోడౌటా?- అయితే ఆమెను వెంటనే చూడాలని నామనసు ఉవ్విళ్లూరుతోంది. వెంటనే స్వయంవరానికి చాటింపేసినట్టు... ఓ 'కేకే' సి నా ముందుకు ప్రవేశపెట్టు...'

'వ... ద్దు... లెం...డి...' మాటలను సాగదీసింది.

'నిన్నొదిలేసి ఆమెతో వుడాయిస్తానని భయమా?-'

'ఛఛ! ఏమిటా మాటలు... మీలాంటి హైక్లాస్ సొసైటీలో వున్న మగగాడు ఛీప్‌గ అలాంటి పనిమనిషితో తిక్క వేషాలేస్తారా?-'

'లేదనుకో! ఊరికే నిన్ను వుడికించాలని అన్నాను. దట్సాల్!!'

'మీ సంగతి నాకు తెలీదా?... శ్రీరామచంద్రుడు సైతం మీ తర్వాతే...'

'ఆమాత్రం కాన్ఫిడెన్స్ వుందివరా!.. అదిచాలు. అనుమానపు భార్య అయితే కాపురం కుదేల్లవుతుంది... ఏమైనా... నువ్వు ఎం.ఏ. తెలుగు కదా?- నీ కల్చరే వేరు. అయినా... అనుమానం ముందు పుట్టి ఆడది తర్వాత పుట్టిందంటారు. కదా?- క్షణక్షణానికి మారు జవరాంద్ర చిత్తముల్... అన్నాడో మహాకవి!- అయితే మొగుడ్ని గుడ్డిగా నమ్మేస్తారీ ఆడ పెళ్లాలు...'

'అదేం భాషా ప్రయోగం...?'

'మాటల్లో తప్పులు దొర్లుతుంటయ్. నువ్వెంత ఎం.ఏ. తెలుగైనా పట్టించుకోరాదు డియర్. అవునూ... మన కొత్త పనిమనిషిని ఆ వరల్డ్ బ్యూటీనీ నాకూ ఒకసారి చూపవా చెలీ... ఓ నెచ్చెలీ...' గారంపోతూ యాక్టింగ్ పాలు పెంచాడు సరసారావు.

అతగాడి మనసు అంత అందమైన పనిమనిషిని ఎప్పుడెప్పుడు చూడటమాని

ఉవ్విళ్లూరుతోంది. తనపైగల నమ్మకాన్ని వమ్ముచెయ్యతల్చుకోలేదు. తొందరపడితే కొపకొల్లేరు... బతుకు బస్టాండు... కాగలదనే భయం మరోవైపు.

'మీరస్సలు చూడరాదు!. చూచిందే తడవు నాకు డైవర్స్ ఇచ్చేస్తానంటారేమోని భయం....'

'దొంగా... టక్కరి మాటలు మాట్లాడకు! అంటూ వెళ్లబోతున్న రమ కొంగు పట్టుకు లాగాడు... కాదు ఆపాడు!!

ఇక్కడొక సెన్సార్ కత్తెర

X X X

ఏరోజూ పనిమనిషి తనకంటపడింది లేదు. ఎప్పుడొస్తుందో?... ఎప్పుడు వెళ్లిపోతుందో అర్థంకాకుండా వుంది సరసారావుకి!.

పదేపదే పనిమనిషి గురించి శ్రీమతిని అడిగితే పరిస్థితి ఎలా వక్రిస్తుందోనే భయంతో మాట్లాడలేకపోతున్నాడు.

సన్డేనాడు పనిమనిషిని నఖశిఖపర్యంత తీరుబడిగా చూసేద్దామని డిసైడైయ్యాడు! కొద్దిరోజులు లైఫ్ పార్ట్నర్ని... అదే వైఫ్‌తో రొమేన్స్ పక్కనపెట్టి... కొత్తగా వచ్చిన పనిమనిషి... అదే అందాల సుందరితో సరసం బిగిన్ చేస్తే ఎలావుంటుందో... వూహకు అందటంలేదు.

ఆ రంబకు... అదే ప్రపంచసుందరైన మా సర్వెంట్ మెయిడ్‌కి దగ్గరైతే... లైఫ్ బోర్‌కొట్టకుండా నిత్యనూతనంగ... ఫ్రెష్‌గ (డెట్టాల్ సోప్‌లా) వుంటుందని ఆశపడుతున్నాడు... కాదు... ఆరాటపడుతున్నాడు సరసారావు.

అందుకే సుందరిని దగ్గరగా చూస్తే ప్రాబ్లమ్ రాగలదని... మేడమీది గది కిట్టికీలోంచి వీక్షిస్తే అందాలను జుర్రుకోవచ్చు... ఆలి అడ్డురాకుండా వుంటుందని డిసైడైయ్యాడు.

కళ్లకు చత్వారమొచ్చినట్టు మేడమీది కిటికీలోంచి వీక్షణంగ వీక్షించినా సుందరాంగి మసక మసగ్గా అవుపించిందో ఏమో... వెంటనే బైక్ మీద సెంటర్‌కెళ్లి ఇంపోర్టెడ్ పవర్‌ఫుల్ 'బైనాక్యులర్స్' తెచ్చి త్రిలోకసుందరి అందాన్ని... వొంపుసొంపులను క్లోజప్ (టూత్‌పేస్ట్ మాత్రం కాదు) లో చూస్తూ జుర్రేసుకుంటూ కాస్సేపు తృప్తిపడ్డాడు.

అబ్బ! ఏమందం?(సారీ... మందం కాదు అందం) బెత్తెడు మందాన కన్పించే ఆమె అందం సరసారావు మతిని కొల్లగొట్టింది.

ఎలాగైతేనేం... పనిమనిసి మొబైల& నెంబర్ ట్రేస్ చేయగలిగిన సరసారావు ముఖాముఖీ మాట్లాడటం గమనిస్తే భార్య ఎక్కడ ఫైర్ అవుతుందోని మొబైల్ ద్వారా ఆమెను ముగ్గులోకి దించాడు. ఆమెకూ తనంటే లైకింగ్ అనే విషయం బోధపడింది. ఫ్లైయింగ్ కిస్‌లాగ ఇద్దరి ముద్దులు వ్యవహారం మొబైల్‌లో సాగుతోంది హాట్‌హాట్‌గ!... సీక్రెట్‌గ!.

'ప్రియా! మొబైల్ లవ్వు... మొబైల్ కిస్సులతో బోరుకొడుతోంది. మనిద్దరి మధ్య నీ భార్య ఘోషాలాగ అడ్డునిలిచింది. మనకలయిక ఇక సినీమా హాల్లోనే... ఇద్దరం రాత్రి సెకెండ్‌షో ఇంగ్లీషు పిక్చర్‌కెడదాం... ఏం?-' పనిమనిషి శశి తన నిర్ణయం వెలిబుచ్చింది (ఎక్స్‌పోజింగ్ అన్నమాట).

ఎగిరిగేంతేశాడు సరసారావు!- ఈ ఛాన్స్ మిస్సవకూడదు. ఇంతటి అందమైన ఆడది... మోడరన్ మహిళ... ఎడ్వాన్స్ అయితే ఆడదానితో సరసం మహాద్భుతంగ వుంటుందన్పించింది.

'ఓ వశీ! నువ్ నాచేతిలో మసి! - నవరసాల సరసాన్ని పండిస్తాను కసితో...' ఇదేంటి హుషారులో కవిత్వం వచ్చేస్తోంది అనుకుని గాభరాపడకుండా తగు జాగ్రత్తవహించాడు.

సెకండ్‌షో పిక్చర్‌కి బాల్కెనీలో బాక్స్ టిక్కెట్లు రెండు బుక్ చేశాడు.!

థియేటర్ చేరుకునేసరికి ఎదురుగా శశి!-... ప్రియశశి! పనిమనిషి శశి సాక్షాత్కరించింది! ఇద్దరూ బాల్కెనీలో రిజర్వుచేయబడినత 'బాక్స్'లో కూర్చున్నారు! అక్కడ మూడో మనిషికి చోటు లేదు. వాళ్లిద్దరే కావటాన అంతా స్వేచ్ఛే!. సరసారావు వొడిలో తలవాల్చిన శశి అతని తలచుట్టూ చెయ్యిపోనిచ్చి ముందుకు వంచి పెదాలపై హాట్ కిస్సిచ్చింది. జన్మ ధన్యమైనట్టన్పించింది. శశి ఇచ్చిన ఆకస్మిక చుంబనలో వున్న మాజా ఎంజాయ్ చేయటానికి కొన్ని గంటలు చాలన్పించింది. శశిని శాశ్వతంగ తనదాన్ని చేసుకోవాలనే నిర్ణయించుకున్నాడు. ఆమె చొరవకు బిత్తరపోతున్నాడు. సినీమా కేవలం ప్రైవేసీ కొరకే అన్నట్టన్పిస్తోంది. ముచ్చాట్లాడుకోవటం, ముద్దుల్లో

మునిగిపోవటంలో... చక్కిలిగింతలు పెట్టుకుంటూ కాలక్షేపం చేసి ఇద్దరూ తృప్తిపడ్డారు.

'నీకో ప్లాట్ కొనిపెడతాను శశీ! అందులో మనకాపురం!' అవునూ... నువ్వింతవరకు మేరేజ్ చేసుకోలేదెందుకని?-'

'నా కంటికి మనసుకు నచ్చిన మనిషి దొరకలేదు. డిగ్రీ చేశాను. నిన్ను దూరంగ చాలాసార్లు చూశాను. నీకోసమే మీ ఇంట్లో పనిమనిషి వేషమెత్తి పన్లో చేరాను. మీ శ్రీమతికి అనుమానం రాకుండా జాగ్రత్తపడ్డాను...' కిలకిలా నవ్వింది శశి.

పిక్చర్ అయిపోవటంతో...ఇద్దరూ నిలబడి గాఢాలింగనం చేసుకుని తృప్తిగా నవ్వుకుని బాక్స్‌లోంచి బైటికొచ్చారు.

శశి మనసెంత నవనీతం?! తను పెళ్లి అయిన వాడిననీ తెల్సి తననే గాఢంగ ప్రేమించటం ఆశ్చర్యం వేసింది సరసారావుకి!.

ఊహల్లో తేలియాడుతూ హుషారుగా కార్‌డ్రైవ్ చేస్తూ ఆఫీసు నుండి ఇల్లు చేరుకున్నాడు సరసారావ్. వస్తూనే 'రమా.. రమా... ఎక్కడున్నావోయ్...' కేకేసి శ్రీమతిని పిలిచినా రెస్పాన్స్ రాకపోవటం చూచి ఆశ్చర్యపడ్డాడు.

బాత్‌రూమ్‌లోంచి మూలుగు విన్పించటంతో అటుకేసి వెళ్లి డోర్ ఓపెన్‌చేసి నిర్ఘాంతపోడాడు.

'వాట్ హేపెన్డ్ రమా...?' రెండు చేతులతో లేవనెత్తిబోయాడు.

'వద్దండీ... నేను లేవలేను. మీరాఫీసుకు వెళ్లినప్పుడు బాత్‌రూమ్‌లో జారిపడ్డానంతే! న నడుము విరిగినట్టయింది. అప్పటి నుంచి కేకలేస్తునేవున్నాను... ఎవరొచ్చి సాయంచేలేదు. నన్ను వెంటనే హాస్పిటల్‌కి తీసుకెళ్లండి...'

కంగారు పడుతూ అంబులెన్స్‌కు మొబైల్ చేశాడు. క్షణాల్లో వచ్చివాలింది. పనిమనిషి ఏమైనట్టు?...' అడిగేడు.

అది వెళ్లేక, నే స్నానానికొచ్చి జారిపడ్డాను! మీరు ఆఫీసుకెళ్లారు. పనిమనిషి లేకుండాపోయింది. నును వంటరిగా కేకలు వేస్తే మాత్రం ఎవరికి విన్పిస్తుంది గనుక... అప్పట్నించీ ఇలాగే ఇక్కడే వుండిపోయాను నొప్పితో బాధపడుతూ...'

హాస్పిటల్ చేరుకోగానే ఆర్థోపెడిక్ సర్జన్ వచ్చి ఎక్సరే తీయించి వెన్నుముకలో వుంటే ఒక ఎముక చిట్లిందని సర్జరీ అవసరమని డయాగ్నైజ్ చేశాడు.

పదిహేను రోజులు ట్రీట్‌మెంట్ కోసం రమతోపాటు సరసారావు కూడా సపర్యలు చేస్తూ వుండిపోయాడు హాస్పిటల్లోనే!

అనవసరంగ పనిమనిషితో రొమేన్స్ వూహించుకుంటూ మనసు పాడుచేసుకున్నాడన్పించింది.

ఎంత అందగా వున్నా పరాయి ఆడదానికోసం ఆశపడటం అనర్థదాయకంగ తోచింది.

రమ బాత్‌రూమ్‌లో జారిపడి హాస్పిటలైజ్ కాకుండా వుంటే తాను నిజంగ పనిమనిషి లవ్‌కోసం తాపత్రయపడి వుండేవాడేమో?-

'థ్యాంక్‌గాడ్! నా బుద్ధి పెడదారి పట్టినా నన్ను మేలుకొలిపావు. నా కళ్లు తెరిపించావు! తానొక మంచి మనిషిగా నడుచుకునేలా చేసినందుకు ఓ దేవుడా నీకు శతకోటి ధన్యవాదాలు' గొణిగేడు.

లైఫ్‌లో రోమేన్స్ కేవలం భార్యాభర్తల నడుమే వుండటం సమంజసం. డిశ్చార్జ చేయించి కార్లో ఇంటికి తీసుకెళ్లి పెళ్లాన్ని గుమ్మంలోనే నిలబెట్టి తాను లోనికెళ్లి పళ్లె తెచ్చి ఎర్రనీళ్లు దిష్ఠి భ్యాకు తీసి కుడికాలు పెట్టి లోనికి రమ్మని... వద్దువద్దు.. రావద్దంటూ తనే... రెండు చేతులతో రమను ఎత్తుకుని తీ(మోసు)సుకెళ్లి అపరిమితమైన సంబరంతో గిరగిర తిప్పుతూండగ...

'అబ్బ దించండి... నన్ను పడేస్తారా ఏంటి? ఆ పనిచేయకండి. మళ్లీ ఎముకలు విరగ్గొట్టుకోలేను...' గోముచేసింది రమ.

'నోనో! రమా ఇది రోమేన్సు మాత్రమేకాదు రమేన్స్! తాళిగట్టిన భార్యతో ఇలాగే రొమేన్స్ చేస్తే ఎంత త్రిల్లింగ్‌గా వుంటుందో తెలుసా?-' మురిసిపోతూ అన్నాడు.

'మన ముద్దు మురిపెం... సరసం... జీవితాంతం వుండేదే... కట్టుకున్న మొగుడి మనసు మారకుండా వుంటే....' చమత్కారంగ చురకేసింది.

వేడివేడి ముద్దొకటికాదు... ముద్దులతో వళ్లంతా తడిపేశాడు మంచంమీద పడుకోబెట్టేక!

కిలకిల నవ్వేసింది రమ.

-- సమాప్తం ---